నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, బుధవారం 23 ఏప్రిల్ 2025 SANGAREDDY


# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- చలో వరంగల్ సభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 22: ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. ములుగులో మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోసపూరిత వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తక్కువ కాలంలోనే రేవంత్ సర్కార్ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజల మనస్సులో బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్ పరిపాలనపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నర్సంపల్లి అర్జున్‌గౌడ్, పెద్దబాల్ అంజన్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేశ్‌గౌడ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొమ్ము నవీన్‌కుమార్, నాయకులు, గణేశ్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ములుగులో సమావేశానికి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు


# రజతోత్సవానికి దండులా తరలివెళ్దాం

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 22: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు దండులా తరలి వెళ్దామని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జహీరాబాద్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏండ్ల పాటు ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు, హామీలకు కాంగ్రెస్ సర్కారు తిలోదకాలు ఇచ్చిందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు విమర్శించారు. సమావేశంలో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల పార్టీ అధ్యక్షులు నారాయణ, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, హీరురాథోడ్, అమీత్‌కుమార్, వహీద్, చిన్నరెడ్డి, రాములు, బస్వరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



నంగునూరు మండలం కోనాయిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం



ఆలయంలోని స్వామివారి మూలవిరాట్

# వెంకన్న దీవెనలు.. స్వరాష్ట్రానికి అడుగులు

- ఆనాడు పార్టీ జెండా, సాహిత్యం, పాటల క్యాసెట్లు దేవుడి సన్నిధిలో పెట్టి పూజలు
- పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రస్తానం.. పదేండ్ల పాలనలో అండగా నిలిచి సిద్దిపేట గడ్డ
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సమాయత్తం
- పులకించిపోతున్న పురిటిగడ్డ


## ఒక్కడుగా బయలుదేరి రాష్ట్రాన్ని సాధించిన నేత కేసీఆర్

## కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పార్టీ ఏర్పాటు

సిద్దిపేట గడ్డ.. ఉద్యమాలకు పురిటిగడ్డ. ఇక్కడి నుంచే మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. ఒక్కడుగా బయలుదేరి కోట్లాది మంది ప్రజలను ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దశాబ్దాల కల సాకారం చేసిన గొప్ప ఉద్యమకారుడు కేసీఆర్. తనకు ఇష్టదైవమైన నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు తీసుకొని తెలంగాణ ఉద్యమానికి బయలుదేరి రాష్ట్రాన్ని సాధించారు. సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపి దేశానికి ఆదర్శంగా నిలిపారు. పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రస్తానం.. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అండదండగా నిలిచింది సిద్దిపేట గడ్డ. ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేసేందుకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల పార్టీశ్రేణులు, అభిమానులు సిద్ధమవుతున్నారు.



కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేయిస్తున్న కేసీఆర్ (ఫైల్)




సిద్దిపేట, ఏప్రిల్ 22( నమస్తే తెలంగాణ ప్రతినిధి): కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ ఉద్యమం చేతబట్టిన కేసీఆర్, శాంతియుత మార్గంలో పోరాటం చేసి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం వస్తేనే మన బతుకులు మారుతాయని భావించి, దీనికోసం మలిదశ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 2001 ఏప్రిల్ 14న సిద్దిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి సభలో కేసీఆర్ పాల్గొని తెలంగాణ కోసం మరో పోరాటం తప్పదని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు బయలుదేరుతున్న తనవెంట మీరంతా నడవాలని కోరారు. కేసీఆర్ పిలుపునకు స్పందించి సిద్దిపేట గడ్డ ఆయన అడుగుజాడల్లో నడిచింది. అదేరోజు ఉద్యమ పార్టీ ఆవిర్భావాన్ని కేసీఆర్ వెల్లడించారు. 2001 ఏప్రిల్ 27న సిద్దిపేటలోని తన స్వగృహం నుంచి నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ జెండా క్యాసెట్లను వెంకన్న స్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి ఆశీస్సులు తీసుకున్న అనంతరం జై తెలంగాణ .. జైజై తెలంగాణ అంటూ ఉద్యమ జెండాను భుజానెత్తుకున్నారు. అక్కడి నుంచి కేసీఆర్ సుమారు వెయ్యి వాహనాల్లో భారీ కాన్వాయ్‌గా హైదరాబాద్‌కు బయలుదేరారు. నాడు సిద్దిపేట నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు,కార్యకర్తలతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది కేసీఆర్‌ను అనుసరించారు. రాజీవ్ రహదారి పొడవునా కేసీఆర్ కాన్వాయ్‌తో నిండిపోయింది.నేరుగా హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంటికి కేసీఆర్ వెళ్లారు. ఇంటి దాకా ప్రభుత్వ వాహనంలో ప్రయాణించిన కేసీఆర్, అక్కడి నుంచి సొంత వాహనంలో బయలుదేరి హుస్సేన్‌సాగర్ సమీపంలోని జలదృశ్యం సభావేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికే కేసీఆర్ ఏం చేస్తున్నారన్న ఉత్కంఠ ప్రజల్లో ఉండింది. సభలో తన మనసులో మాట బయటపెట్టారు.తెలంగాణ కోసం తన పదవులకు రాజీనామా చేస్తూ మూడు లేఖలు చంద్రబాబుకు పంపించారు. డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీ సభ్యత్వం, పార్టీ పదవులకు ఒకేసారి రాజీనామా చేసి ఆ సమయంలో ఒక రికార్డు నెలకొల్పారు కేసీఆర్. పదవులు కోసం కాదు.. ప్రజల కోసం పోరాటమంటూ తన లక్ష్యాన్ని ప్రకటించారు. పదవులు వదులుకోవడమనేది అప్పటి వరకు ఎవరూ ఊహించని చర్య. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి అనే ఉద్యమ పార్టీ స్థాపించారు.2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ద్వారా భారత రాష్ట్ర సమితి(తెలంగాణ రాష్ట్ర సమితి) అనే ఉద్యమ పార్టీని స్థాపించారు.ఆ రోజు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ యావత్తు సమాజం పులకించింది.

## కేసీఆర్ సెంటిమెంట్ ఆలయం

నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం తనకు సెంటిమెంట్‌గా కేసీఆర్ భావిస్తారు. 1985 నుంచి ఏ పని తలపెట్టినా ఇక్కడ పూజలు చేయడం కేసీఆర్‌కు ఆనవాయితీగా మారింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి సిద్దిపేటకు ఎన్నికయ్యారు. 1989, 1994, 1999, 2001, 2004, 2009, ఎన్నికల నామినేషన్ పత్రాలపై ఈ ఆలయంలో పూజలు నిర్వహించి, నామినేషన్ వేసి విజయం సాధించారు. టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు 2001 ఏప్రిల్ 27న రాజీనామా చేసి, అదే రోజు ఉదయం కోనాయిపల్లి వెంకన్న ఆశీర్వాదం తీసుకొని బీఆర్ఎస్ (టీఆర్ఎస్)పార్టీని స్థాపించారు. పార్టీ జెండాతో పాటు, సాహిత్యం, పాటల క్యాసెట్లను దేవుడి సన్నిధిలో పెట్టి పూజలు చేశారు. అనంతరం భారీ కార్ల ర్యాలీతో హైదరాబాద్‌లోని జలదృశ్యంలో పార్టీని ఏర్పాటు చేసి 14 ఏండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రం సాధించారు. 2004లో తెలంగాణ ప్రాంతంలో పోటీ చేస్తున్న బీఆర్ఎస్(టీఆర్ఎస్)ఎమ్మెల్యే అభ్యర్థుల బీ-ఫారాలకు కోనాయిపల్లి ఆలయంలో పూజలు చేయించి వారికి అందజేశారు. ఆ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్‌కు, సిద్దిపేట అసెంబ్లీకి పోటీచేసిన కేసీఆర్ రెండు చోట్ల ఘన విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీ స్థానానికి, హరీశ్‌రావు సిద్దిపేట ఎమ్మెల్యే స్థానానికి, కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే స్థానానికి ముగ్గురి నామినేషన్ పత్రాలకు పూజలు చేయించి నామినేషన్ వేయించారు. ఈ ఎన్నికల్లో సైతం ఘన విజయం సాధించారు. 2014,2018 సాధారణ ఎన్నికల్లో సైతం ఇక్కడ కేసీఆర్ పూజలు చేసి విజయం సాధించారు. వరుసగా రెండుసార్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలిపారు. గత సాధారణ ఎన్నికల్లో కొద్ది సీట్లతో బీఆర్ఎస్‌కు అధికారం దూరమైంది. గజ్వేల్ స్థానం నుంచి భారీ మెజార్టీతో కేసీఆర్ విజయం సాధించారు.

# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు, ఏప్రిల్ 22: అనేక హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిన తర్వాత విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ విమర్శించారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ దారి ఖర్చులకు మంగళవారం చిన్నకోడూరులోని శ్రీనివాస్ రైస్‌మిల్ ఇండస్ట్రిలో బీఆర్ఎస్ నాయకులు కూలి పనిచేశారు. రైస్‌మిల్లులోని బియ్యం సంచులను ట్రాక్టర్లలో లోడింగ్ చేశారు. దీనికి శ్రీనివాస ఇండస్ట్రీస్ యాజమాన్యం రూ.10 వేలు, సివిల్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సభకు చిన్నకోడూరు మండలం నుంచి భారీ సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్తామని తెలిపారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాపయ్య, కనకరాజు, కాముని ఉమేశ్‌చంద్ర, ఇట్టబోయిన శ్రీనివాస్, కొండం రవీందర్ రెడ్డి, ఎల్లయ్య, వెంకటేశం, అబ్బిరెడ్డి, సుంచు రమేశ్, మిట్టపల్లి గణేశ్, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, చెట్టుపల్లి భానుచందర్, మన్నె ఆనంద్, పలువురు పాల్గొన్నారు.



చిన్నకోడూరులోని రైస్‌మిల్లులో కూలిపని చేస్తున్న రాధాకృష్ణశర్మ, నాయకులు

# రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మద్దూరు: కూటిగల్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 22: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు బర్మ రాజమల్లయ్య మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్‌లో తలపెట్టిన రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మాజీ మండల అధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కర్ర అరుణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, పీఏసీఎస్ డైరెక్టర్ దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

**కూటిగల్‌లో..**

ఈనెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ చేపట్టిన రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం కూటిగల్‌లో బీఆర్ఎస్ నాయకులు రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు గూళ్ల ఆనందం, నందనబోయిన నర్సింహులు, మాజీ సర్పంచ్ దోమ బాలమణిబాలకృష్ణ, శ్రీరాముల సత్తయ్య పాల్గొన్నారు.

**రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి**

బెజ్జంకి, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బిగుళ్ల మోహన్ ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సభ కోసం యూత్ సభ్యులు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.



హుస్నాబాద్ పట్టణంలోఎల్కతుర్తి సభ పోస్టర్‌ను అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఎల్కతుర్తి సభకు తరలిరండి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 22: హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని పలువార్డుల్లో మంగళవారం రజతోత్సవసభ పోస్టర్లు వేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. కనీవినీ ఎరగని రీతిలో బీఆర్ఎస్ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతంనుంచి వేలాదిగా రజతోత్సవ సభకు ప్రజలు తండోపతండాలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, బీఆర్ఎస్ నాయకులు కన్నోజు రామకృష్ణ, అయిలేని శంకర్‌రెడ్డి, పూదరి రవీందర్, మేకల వికాస్‌యాదవ్, పలువురు ఉన్నారు.

# మత్స్యకారులకు మార్కెటింగ్ కల్పిస్తాం

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కోహెడ, ఏప్రిల్ 22: మండలంలోని శనిగరం గ్రామ మత్స్యకార సహకార సంఘంలో మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారుల సమస్యలు తెలుసుకున్నారు. మండలంలోని శనిగరం, గుండారెడ్డిపల్లి, చిన్నకోడూరు మండలం, చెర్లఅంకిరెడ్డిపల్లి, అనంతసాగర్ గ్రామస్తులు మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారని సొసైటీ సభ్యులు తెలిపారు. రిజర్వాయర్‌లో చేపలు పట్టి నేరుగా ఇండ్లకు వెళ్లి విక్రయాలు చేపడుతున్నామని తెలిపారు. చేపల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. చేపలు అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయం వలలు కొనడానికి సరిపోవడం లేదని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అధునాతన తెప్పలు, చేప విత్తనం ఏప్రిల్‌లో ఇవ్వాలని, చేపలు అమ్మగా మిగిలిన చేపలను ఉంచడానికి స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను మత్స్యకారు సభ్యులు కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్స్య సహకార సంఘాలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి మత్స్య సహకార సొసైటీ కృషిచేస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం కోసం ప్రైవేటు కంపెనీలకు అనుసంధానం చేయడం, సలహాలు, సూచనల కోసం డిగ్రీ కళాశాల మత్స్య శాఖ విద్యార్థులను, అధ్యాపకులను ఇక్కడకు తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, కృషికల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ సురేఖ, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి , మత్స్యసహకార సొసైటీ అధ్యక్షుడు కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం నాయకులు

# పాదయాత్రను విజయవంతం చేయాలి

- 25న పాదయాత్ర ప్రారంభం
- బీఆర్ఎస్‌వీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల శ్యామ్ యాదవ్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 22 : ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు వెయ్యి మంది విద్యార్థి, యువతతో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌వీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల శ్యామ్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పొన్నాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 25న ఉదయం 7 గంటలకు సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం నుంచి ఎల్కతుర్తి బహిరంగ సభ ప్రదేశానికి పాదయాత్రగా వెళ్తామని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి, యువ నాయకుడు ముందుకు వచ్చి చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నరేశ్ యాదవ్, మహేందర్‌రెడ్డి, వాటు ప్రశాంత్, నరేందర్‌రెడ్డి, తిరుపతి, కళ్యాణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సంతోషం కరువు

- రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆగం
- 27న చలో వరంగల్ సభకు దండులా కదలిరావాలి
- పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 22: కాంగ్రెస్ పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్లకు సంబంధించి ఆర్సీపురం లక్ష్మీగార్డెన్స్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రజలకు ఎన్నో ఆశలు పెట్టి కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఉచిత బస్సు తప్పా మిగతా హామీలు అమలు కావడం లేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉండేవారని గుర్తుచేశారు. అన్నివర్గాలకు కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని ఇప్పుడు ప్రజలు భావిస్తున్నారని, మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన స్వలాభం కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లారని, అయినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని నమ్ముకొని ఉన్నారని తెలిపారు. 27న చలో వరంగల్‌కు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు దండులా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్పొరేటర్ సింధూ తదితరులు మాట్లాడారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నేతలు అంజయ్య, సోమిరెడ్డి, రాములుగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, కుమార్‌గౌడ్, పరమేశ్, దేవేందర్ యాదవ్, బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బాబ్జీ, ఉమేశ్, శ్రీశైలం, శ్రీధర్‌చారి, వెంకట్రామ్‌రెడ్డి, కాల్వగడ్డ రాజ్‌కుమార్, మైపాల్‌యాదవ్, పృధ్వీ, నర్సింహ, కృష్ణకాంత్, సత్యనారాయణ, దేవేంద్రాచారి, అజీముద్దీన్, కుత్బుద్దీన్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ప్యాడీ క్లీనర్

# రైతులకు సరిపడా ప్యాడీ క్లీనర్లు లేక ఇక్కట్లు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 22: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సరైన సౌకర్యాలు లేక రైతులకు తిప్పలు తప్పడం లేదు. హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు ధాన్యాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు. పొలాల వద్ద ధాన్యం ఆరబోసేందుకు సరైన స్థలం లేకపోవడంతో రైతుల ధాన్యం అంతా మార్కెట్‌కు రావడంతో ధాన్యం రాశులతో నిండిపోతున్నది. ఆరబోసిన ధాన్యం పట్టేందుకు కొత్త ప్యాడీక్లీనర్లు(లిఫ్టర్) పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో కొనుగోలు చేసిన ప్యాడీక్లీనర్లు సరిగా పనిచేయకపోవడంతో వాటిని మూలన పడేసిన అధికారులు నూతనంగా రెండు ప్యాడీక్లీనర్లు కొనుగోలు చేశారు. రైతుల ధాన్యం పట్టేందుకు అవి సరిపోకపోవడంతో వాటికోసం రైతుల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వందలాది క్వింటాళ్ల ధాన్యం మార్కెట్‌కు వస్తుంటే కేవలం రెండు క్లీనర్లతో సరిపుచ్చుతున్న వ్యవసాయ మార్కెట్ అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.